శ్రీ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కృష్ణదాస్

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని మడపాం గ్రామ వంశధార నదీ తీరంలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామిని మంగళవారం వైసిపి జిల్లా అధ్య క్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ దర్శించుకున్నారు. శ్రీ అభయాంజనేయ స్వామి మూడవ వార్షి కోత్సవం సంధర్భంగా హాజరైన కృష్ణదాస్ స్వామివారికి ప్రత్యేకంగా పూజలు చేసి, స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, చింతు రామారావు, కె.సిహెచ్.బి గుప్తా, తంగుడు జోగారావు, రాజాపు అప్పన్న, ముద్దాడ బైరాగినాయుడు, సతివాడ రామినాయుడు, రువ్వ వాసుదేవరావు, జాయి శేషు, మార్పు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌దే భవిష్యత్తు : ఎమ్మెల్యేలు అశోక్, శిరీష

విశాలాంధ్ర - సోంపేట : రాబోవు కాలంలో సోలార్ విద్యుత్‌దే అత్యంత కీలక పాత్ర అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. సోంపేట సమీపంలో జింకిభద్ర జంక్షన్‌లో సోంపేటకు చెందిన బీన వంశీ, బీన పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ యూనిట్‌లకు సంబంధించి కొత్తగా నెలకొల్పిన మిరాయి సోలార్ ఎనర్జీ యూనిట్ ఆఫీసును ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజుతో కలిసి పాల్గొన్న ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియో గానికి చూపుతున్న చొరవ ప్రశంసనీయ మైనదని అన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్‌ను నెలకొల్పేందుకు అవసరమైన వ్యయంలో రాయితీలు కల్పించడం, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి వాయిదాల పద్ధతిలో రుణం తీర్చుకునే సదుపాయాలు కల్పించడం వినియోగదారులకు వరమని అన్నారు. ఇటువంటి సోలార్ విద్యుత్ యూనిట్‌లను ప్రతిఒక్కరు ఏర్పాటు చేయడం ద్వారా గృహ వాణిజ్య అవసరాలకు అవసరమైన విద్యుత్ సులభంగా వాడుకోవచ్చని అన్నారు. దీని ద్వారా ఇప్పటి వరకు పొందుతున్న విద్యుత్ చార్జీల భారం బాగా తగ్గుతుందని ప్రతిఏటా ఒక్కొక్క కుటుంబానికి వేలాది రూపాయల మిగులు ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీన వంశీ సోదరులు సోలార్ యూనిట్ ద్వారా విద్యుత్ పొందే విధానం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ చంద్రమోహన్, బీన ఆనంద్, చిత్రాడ శ్రీను, శేఖర్, మధుబాబు, జనసేన నేత బీన ప్రదీప్, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బీన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

రథసప్తమి వేడుకల్లో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఎస్ ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రథసప్తమి వేడుకలలో భాగంగా సూర్య నారాయణ స్వామి వారిని దర్శించు కునేందుకు వచ్చిన భక్తులకు ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు సుమారు 5000 మంది భక్తులకు పులిహొర, వాటర్ ప్యాకెట్, మజ్జిగ లను అందచేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రతి ఏడాది రథసప్తమి రోజున తన వంతు భక్తులకు ఏదో ఒక విధంగా సేవ చేయడం ఆనవాయితి అని తెలిపారు.

పీయూసీ చైర్మన్‌గా కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆంధ్రప్రదేశ్ శాసనసభ లోని ఫైనాన్షియల్ కమిటీలను మంగళవారం శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల సమితి (పియుసి) అధ్యక్షునిగా ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పిఏసి అధ్యక్షులుగా పులపర్తి రామాంజ నేయులు, అంచనాల కమిటీ అధ్యక్షునిగా వేగుళ్ళ జోగేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 175 మంది శాసన సభ్యుల నుంచి 9 మంది నీ సభ్యులుగాను, రాష్ట్ర శాసన పరిషత్ 58 సభ్యుల నుంచి ముగ్గురుని సభ్యులుగా నియమించారు. దీంతో శాసనసభలో మూడు ఫైనాన్షియల్ కమిటీలు ఏర్పాటు చేస్తూ స్పీకర్ ఉత్త ర్వులు జారీ చేశారు.

హంసవాహిని పుస్తక బహూకరణ

విశాలాంధ్ర - పొందూరు : తెలుగు రచయితల వేదిక(శ్రీకాకుళం) ఆధ్వర్యంలో తాజాగా ప్రచురించిన హంసవాహిని (కవితా సమాహారం) పుస్తకాన్ని స్థానిక ఎస్.బి.ఐ చీఫ్ మేనేజర్, తెలుగు భాషాభిమాని సి. హెచ్.ప్రసాద రావుకు స్థానిక నామ విజ్ఞాన వేత్త,ఎస్.బి.టి క్లబ్ జీవితకాల సభ్యులు వాండ్రంగి కొండలరావు బుధవారం బహుకరించారు. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన "ఈ కాలం పిల్లాడు"(బాలల నవల)ను కూడా ఈ సందర్భంగా అందజేశారు. తెలుగు భాషా, సంస్కృతులను పరిరక్షించుకోవలసిన గురుతర బాధ్యత సమాజంపై ఉందని చీఫ్ మేనేజర్ ప్రసాదరావు వ్యాఖ్యానించారు. విద్యార్థులు, తలిదండ్రులు, ఉపాధ్యాయులు, అలాగే భాషా సాంస్కృతిక శాఖ గత వైభవాన్ని పునరుద్ధ రించేందుకు తగు కృషి చేయగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలుగు రచయితల వేదిక సభ్యులను, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమా మహేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా కాళీమాత ఉత్సవం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం తొత్తిడిపుట్టుగ గ్రామస్థులు మంగళ వారం కాళీమాత ఉత్సవంను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మధ్యా హ్నం అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దులు, మేళతాళాలు, కాళికానృత్యాలతో గ్రామంలో ఊరేగించి అనంతరం 10 కీలో మీటర్ల దూరంలో ఉన్న బొరివంకలోని కాళీమాత గుడి వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆదిత్య నామ స్మరణతో మార్మోగిన అరసవల్లి

- నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తజనం - స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు - ప్రశాంతంగా ముగిసిన వేడుక

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు రోజులు పాటు అట్టహాసంగా నిర్వహించిన వేడుకలు మంగళవారం తో ముగిశాయి. ఈ వేడుకలో సోమవారం రాత్రి 12 గంటల తరువాత దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం రథ సప్తమి వేడుకలప్రధాన ఘట్టం ప్రారంభమయ్యాయి. క్షీరాభిషేకం తో స్వామి వారి నిజరూవ దర్శనానికి భక్తులు అరసవల్లి కి పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి రాష్ట్రం లోని పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. దారులన్నీ అరసవల్లి వైపు ప్రయాణించాయి. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కే వీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ మహ్మద్ ఖాన్, స్థానిక ఎంఎల్ఏ గొండు శంకర్, దేవాదాయ శాఖ, ఇతర అధికారులు సమన్వయం తో ఈ వేడుకలు ప్రశాతంగా ముగిశాయి. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పులిహొర, మజ్జిక, మంచి నీటిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పోలీసుల పనితీరు స్పష్టంగా కనిపించింది. జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు సిబ్బంది నీ సమన్వయం చేస్తూ, సీసీ కెమెరా ల ద్వారా భక్తుల రద్దీని అంచనా వేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంత వాతావరణం లో భక్తులు స్వామి వారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో క్యు లైన్ లు కిక్కిరిసాయి. జిల్లా అధికారుల సమన్వయం తో రథ సప్తమి వేడుకలు ప్రశాతంగా ముగిశాయి.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు... రథసప్తమి వేడుకలో ప్రముఖులు పాల్గొని శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. వారందరికీ ఆలయ అర్చకులు అనివెట్టి మండపం లో ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా పరిషత్ చైర్ వర్సన్ పిరియ విజయ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట, పలాస, పాతపట్నం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కూన రవికుమార్, భీమిలి ఎమ్మెల్యే శ్రీనివాస రావు సతీమణి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి తదితరులతో పాటు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, విజయనగరం జిల్లా జడ్జి కళ్యాణ్ చక్రవర్తి, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, డీఆర్వో వెంకటేశ్వర రావు, ఆర్డిఓ లు ప్రత్యూష, కృష్ణమూర్తి తదితరులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు.

జాతీయస్థాయిలో మెరిసిన అభిజిత్

విశాలాంధ్ర - కవిటి : క్రమశిక్షణ, అంకితభావం, పోటీతత్వంతోనే విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదుగుతారని మండల విద్యాశాఖాధికారి ధనుంజయ మజ్జి అన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిఫణి మెరిట్ టెస్ట్ 2025లో 10వ తరగతి విభాగం నుండి కవిటి మండలం ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జల్లు అభిజిత్ మొదటి ర్యాంకు సాధించాడు. ఈ పరీక్షను ఆన్లైన్లో నిర్వ హించారు. విజేతగా నిలిచిన అభిజిత్కు రూ.8 వేలు నగదుతో పాటు మెమెంటోను అందించారు. ఈ సంద ర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యాక్రమంలో విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శాంతి, ఉపాధ్యాయులు కె.రామకృష్ణ, ఎస్. కృష్ణ, ఆనంగి నాగేశ్వరరావు, ఎం.గోపి, అప్పలరాజు, పీఎంసి చైర్మన్ ఆర్. చిరంజీవమ్మ, గ్రామపెద్ద పి.చంద్రశేఖర్, పి. పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోష్ణ



విశాలాంధ్ర - పొందూరు : రథ సప్తమి సందర్భంగా అరసవల్లి (సూర్య భగ వానుని) సూర్య నారాయణ స్వామిని కుటుంబ సమేతంగా పొందూరు జూనియర్ సివిల్ జడ్జి బి.జోష్ణ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయమర్యాదలతో స్వాగతం పలుకుతూ ఆలయ దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తదనంతరం జడ్జి జ్యోష్ణ మాట్లాడుతూ చీకటి అలుముకున్న ప్రపంచానికి నిత్యం తన వెలుగులతో చీకటిని మాయం చేసే శక్తి సూర్యభగవానుడికి ఉందని, సూర్య భగవానుని సప్త కిరణాలు భూమిని తాకడం వల్ల అందరికి విశేషమైన తేజస్సు,ఆరోగ్యం, ఉత్సాహం కలుగుతాయని, ఆ సూర్య భగవానుడు ప్రజలులందరికీ అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని కోరారు. ఈ సందర్భంగా అందరికీ రథసప్తమి శుభాకాంక్షలు తెలిపారు.

జగన్నాథ స్వామికి వెండి హస్తాలు వితరణ

విశాలాంధ్ర - కవిటి : మండల కేంద్రమైన కవిటిలో శ్రీజగన్నాథ్ స్వామి విగ్రహానికి శ్రీ శివ చింతామణి పాన్ షాప్స్ వర్తక సంఘ సభ్యులు వెండి హస్తాలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కవిటి జగన్నాథ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులకు సుమారు రూ. 1. 30 లక్షలు విలువచేసే వెండి హస్తాలను స్వామి వారికి బహుకరించినట్లు శ్రీ శివ చింతామణి పాన్ షాప్స్ వర్తక సంఘ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి హస్తాలను స్వామివారి విగ్రహానికి అలంకరించారు.

క్రమశిక్షణ గల విద్యాబోధనే ధ్యేయంగా పనిచేయండి

మండల విద్యాశాఖాధికారి రాములు

విశాలాంధ్ర - పొందూరు : క్రమశిక్షణ గల విద్యే, విద్యార్థుల మేధావాభివృద్ధికి తోడ్పడుతున్న దృశ్య, బాలల విద్య భవితకు సోపాణాలయ్యే విధంగా చదువు లందించాలని మండల విద్యాశాఖ అధికారి జి.రాములు ఉపాధ్యా యులకు కోరారు. మండల కేంద్రంలో దేవాంగుల కాలనీలో ఉన్న నెంబర్ 4 ఎంపీపీ స్కూలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా పై విధంగా అన్నారు. విద్యార్థులకు చక్కనైన చదువులు అందించేందుకు సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చించి నిధులు మంజూరు చేస్తున్న దృశ్య ప్రభుత్వం చేస్తున్న కృషికి చక్కనైన ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివే దశగా పనిచేయాలని ఆయన కోరారు. నిరుపేదల కుటుంబాలలో అక్షర ఉత్సాహం పెంచడానికి ప్రోత్సాహవించే మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎండిఎం ఏజెన్సీలకు ఆదేశించారు. వంటశాలల ప్రాంగాణం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. నిబంధనలకు అతిక్రమిస్తే ఎంతటి వాడైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వంటకాల రుచులను పరిశీలించారు. పాఠశాల రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎల్వి రమణారావు, ఉపాధ్యాయులు వాగ్దేవి, రఘు బాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అపజయమే విజయానికి మెట్టు : సీఎస్ఐ సెక్రటరీ



విశాలాంధ్ర - టెక్కలి : జయాప జయాలు ఎలా ఉన్నా విద్యార్థులు పోటీలో పాల్గొనడమే ప్రధానమని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) హైదరాబాదు కార్యదర్శి డాక్టర్ డి.వి.రమణ అన్నారు. ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి టెక్నో విజన్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజయాలు సాధించిన గొప్పగొప్పవారంతా ఎన్నోసార్లు ఓటమి చెందిన వారేనని అన్నారు. ప్రయత్న లోపం లేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సిఎస్ఐ చైర్మన్ సుధాకర్ సిహెచ్ మాట్లాడుతూ క్రమశిక్షణగా టెక్నోవిజన్ నిర్వహించడం పట్ల ఐతమ్ నిర్వహకులకు అభినందించారు. కన్వీనర్, సిఎస్ఈ హెచ్ఐడి డాక్టర్ వై.రమేష్ పోటీల గూర్చి వివరిస్తూ 'ఇన్నోవేట్ నౌ, కోడ్ వార్, డిబగ్ చాలెంజ్, మైండ్ మాస్టర్' వంటి పోటీలను నిర్వహించి విజేతలకు రూ.50 వేల వరకు నగదు బహు మతులను, ప్రశంసా పత్రాలను అతిదులు అందజేశారన్నారు. ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల. కాకినాడ ఆదిత్య వుమెన్స్ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పోలిటెక్నిక్ కళాశాల శ్రీకాకుళం విద్యార్థులు బహుమతులు పొందిన వారిలో ఉన్నారు. ఈ ముగింపు సమావేశంలో డీన్ డాక్టర్ యు.డి.ప్రసన్న, కో-కన్వీనర్ డాక్టర్ టి. రవికుమార్, హెచ్ డిలు, అధ్యాపకులు,విద్యార్థి కన్వీనర్లు ప్రణవ్, సంధ్యన, విద్యార్థులు పాల్గొన్నారు.

7న శ్రీ మహాలక్ష్మి తల్లి కళ్యాణం

విశాలాంధ్ర - రణస్థలం : మండలంలోని కమ్మసిగడాం గ్రామంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా కొలవబడే మహాలక్ష్మితల్లి, గురప్పదొరల కళ్యాణం శు క్రవారం రాత్రి 9:25 గంటలకు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పెళ్ళిరాట రథసప్తమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించారు. అనంతరం మూడురోజుల పాటు నిర్వహించనున్న జాతరకు సంబంధించి శ్రీ మహాలక్ష్మితల్లి కమ్మవారి కళ్యాణ మండపంలో మేనేజ్మెంట్ కమిటీ సభ్యులతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు వి.వి.ఎస్.వి.ప్రసాద్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రథసప్తమి రోజు కల్యాణ రాట మేయడం ఆనవా యితీగా వస్తుందని తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా సేవలందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, వెలిచేటి తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్ కుమార్, వెలిచేటి మురళీధర్, వెలిచేటి రాయుడు, మన్నె కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, జి.రఘునాథ్, మన్నె తాతీయులు, సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారంతో ఆరోగ్యవంతమైన జీవితం

విశాలాంధ్ర - పలాస : సూర్య నమస్కారాలతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జె. వెంకటలక్ష్మి అన్నారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం క్రీడ మైదానంలో విద్యార్థులతో సూర్య నమస్కారములు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సూర్య నమస్కారముల ప్రాముఖ్యతను వివరిస్తూ సూర్యునిలో సప్త కిరణములు ఉంటాయని ఒక్కొక్క కిరణంకు సంబంధించి ఉపయోగాలను వివరించారు. భారత దేశ వేదంలలో ఉన్న కిరణాల ప్రాముఖ్యతను ఒక్కొక్కటిగా వివరిస్తూ శుష్మం అనే కిరణం పక్షపాతం రాకుండా కాపాడుతుందని, హరికేసం అనే కిరణం గుండెలో కొవ్వు కరిగిస్తుందన్నారు. విశ్వ కర్మం అనే కిరణం రక్తంలో ఐరన్ పెంచుతుందని మరియు విశ్వవ్యచం అనే కిరణం ఊపిరితిత్తులకు క్షయ దగ్గు రాకుండా చేస్తుందన్నారు. సంపద్వసం అనే కిరణం జనన అవయవమును మెరుగుపరుస్తుందని, అర్వగ్వసం అనే కిరణం నరాల బలహీనతను తగ్గి స్తుందన్నారు. స్వర ద్వసం అనే కిరణం స్వరపేటికను మెరుగుపరుస్తుందని వివరించారు.అనంతరం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు సూర్య నమస్కారముల ప్రయోజనాలు వివరిస్తూ శరీరము అంతటికి వ్యాయామం, గుండెకు రక్తప్రసరణ సక్రమంగా శ్వాసక్రియ పద్ధతిగా జరుగుతుందని తెలిపారు. వినాళగ్రందులు సమన్వయంతో పాటు, హార్మోన్ల క్రమ బద్ధికరించి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని నాడులు సున్నితంగా సాగదీయబడి మెదడును ఉత్తేజం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటరమణ ఐక్యూ ఏ సి కోఆర్డినేటర్ సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్ శ్రీనివాస పట్నాయక్ మరియు విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా పౌండేషన్ స్వచ్చందసేవా సంస్థ 55,000 మందికి పులిహోర పంపిణీ...

విశాలాంధ్ర - హిరమండలం : మంగళవారం రథసప్తమి సందర్భంగా అరసవల్లిలో విద్యా ఫౌండేషన్స్, ఆర్ట్స్, మరియు వై.సి.బి స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా మొత్తంగా 55,000 మంది భక్తులకు పులిహొర మరియు మినరల్ వాటర్ అందివ్వడం జరిగింది. ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొన్న వాలంటర్లకు, మా కార్యాలయాల సిబ్బందికి మరియు పెద్ద ఎత్తున స్వచ్ఛందగా ముందుకు వచ్చి భక్తులకు సకల సదుపాయాలను కల్పించిన సహచర స్వచ్ఛంద సంస్థలకు, వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు, పోలీసు సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి, వైద్య సిబ్బందికి మరియు ఇంత ఘనంగా రాష్ట్ర పండుగగా నిర్వహించటానికి అవకాశం కల్పించిన ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టర్ కు మరియు జిల్లా ఎస్.పి కి విద్యా పౌండేషన్ అధ్యక్షులు ఉదంద్రావుప్రసాద్ హృదయపూర్వక ధన్యవాదములు ఈ సందర్భంగా తెలిపారు.

మెరుగైన జీవన శైలితో చక్కనైన ఆరోగ్యం : ఎంపీపీ దాసు

విశాలాంధ్ర - సోంపేట : సమాజంలో ప్రతి వ్యక్తి మెరుగైన జీవనశైలి ద్వారా చక్కనైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. పట్టణంలోని సంస్కారభారతి విద్యా సంస్థల్లో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వై.దేవరాజుతో కలిసి కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ దాసు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒకవైపు విద్యకు ప్రాధాన్యం ఇస్తూ మరోవైపు ఆరోగ్య సంరక్షణకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంచి ఆరోగ్యం ద్వారా జీవనం సాగించినంతకాలం దేనినైనా సాధించేందుకు ఉత్సాహంగా ప్రయత్నించవచ్చని అన్నారు. ఈ నేపథ్యంలో వ్యాయమానికి, మంచి ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మాంసాహారాన్ని, ఫాస్ట్‌ఫుడ్‌లను, ఆయిల్, మసాలా దినుసులను బాగా తగ్గించుకోవాలని సూచించారు. ఆహారంలో పండ్లు, తాజా కాయగూరలు, ఆకు కూరలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కేనర్సన్ ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా నివారించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. క్యాన్సర్‌కు దూరంగా ఉండాలంటే తీసుకోవల్సిన ఆహారంతో పాటు పండ్ల రకాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి, ఏఓ వడగ పాపారావు, బిపిడిఈ కోఆర్డినేటర్ శరత్‌బాబు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘడ్‌లో తెలుగు మహాసభలు

విశాలాంధ్ర - పలాస : ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర రాజధాని రాయిపూర్ లో మార్చి 8 నుండి 9 వరకు జరిగే ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర స్థాయి తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్లు మహాసభల కన్వీనర్ రుద్ర మూర్తి తెలిపారు. మంగళవారం విజయవాడ బంకింగ్ హం పోస్టాఫీస్ ఎదురుగా గల ప్రపంచ తెలుగు రచయితల మహాసభల కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మహాసభ వివరాలను రుద్ర మూర్తి వివరించారు. భిలాయి స్టీల్ ప్లాంట్ నిర్మాణ దశ, రైల్వే విస్తరణ సమయంలో ఉపాధి కోసం తెలుగువారు ఛత్తీస్ గడ్ వచ్చారని, అలా వచ్చిన వారిలో ఉత్తరాంధ్ర, ఒంగోలు, నెల్లూరు, గోదావరి జిల్లాలకు చెందిన వారు ఉన్నారన్నారు. గత ఏడు దశాబ్దాలుగా తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకొనే ప్రయత్నంలో స్థానికంగా తెలుగు సాంస్కృతిక, సాహిత్య, కుల, గ్రామ సంఘాలను ఏర్పాటు చేసుకొని, రామాలయాలు, బాలాజీ మందిరాలు, తెలుగు పాఠశాలలు స్థాపించుకున్నారని తెలిపారు. సంక్రాంతి, ఉగాది, ఆంధ్ర రాష్ట్ర అవతరణ, మహాకవి గురజాడ, శ్రీశ్రీ, కందుకూరి, గిడుగు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తదితరుల జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు జరుపుకుంటూ వస్తున్నామన్నారు. తమ సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకొనే ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలు సమిష్టిగా ఒక వేదికపై చర్చించడానికి ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. 70 ఏళ్లకు పైగా ఛత్తీస్ ఘడ్ లో నివసిస్తున్న ఎస్.సి., ఎస్.టి. మరియు బి.సి.సామాజిక వర్గాలకు చెందిన తెలుగువారికి తగిన గుర్తింపు లభించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యా ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లను కూడా కోల్పోతున్నామని, పాఠశాలల్లో తెలుగువారి కులం పేరు తెలుగు అని రాస్తారని ఇలాంటి సమస్యల వలన తమ కులం పేరును మార్చి స్థానికుల కులం పేరుతో సమానమైన పేరును రాసుకోవడం జరుగుతోందన్నారు. ఛత్తీస్ ఘడ్ లో మూడు లక్షలకు పైగా తెలుగువారు నివసిస్తున్నారని, కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ నాయకులు గెలుపుకు తెలుగు ఓటర్లు నిర్ణయాత్మకమైన పాత్ర వహిస్తున్నారని గుర్తు చేశారు. మున్సిపాలిటీ మరియు పంచాయితీల్లో వార్డు ప్రతినిధులుగా తెలుగు వారు అధికంగా ఎన్నికవుతున్నారని తెలిపారు.ఈ సభలకు ఛత్తీస్ ఘడ్ లోని వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్న తెలుగు సంఘాల ప్రతినిధులు, భాషాభిమానులు కనీసం 3,000 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఆహ్వానించినట్లు తెలిపారు. అలాగే ఛత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్, ఉప ముఖ్యమంత్రులు అరుణ్ సావ్, విజయశర్మ, సాంస్కృతిక శాఖామాత్యులు అజయ్ చంద్రాకర్ పాల్గొంటున్నట్టు తెలిపారు. కేంద్రమంత్రి శ్రీ రామ్మోహన నాయుడు, సాంస్కృతిక శాఖామాత్యులు కె. దుర్గేష్, ఆరోగ్య శాఖామాత్యులు సత్య కుమార్ యాదవ్ మరియు విద్యా మంత్రి నారా లోకేష్, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జున రావులను ఆహ్వానించామని తెలిపారు. సభల్లో జరిగే సాహిత్య చర్చల్లో డా. పసునూరి రవీందర్(హైదరాబాద్), డా.విజయ భాస్కర్ (శ్రీకాకుళం), బాల సుధాకర్ మౌళి (విజయనగరం), ఎన్. వేణుగోపాల్ (హైదరాబాద్) డా.సుంకర గోపాలయ్య (తాడేపల్లిగూడెం), ప్రొఫెసర్ వినోదిని (కడప), సిరికి స్వామి నాయుడు (పార్వతీపురం), పిల్లా తిరుపతిరావు (రాజాం), బద్రి కుర్మారావు (విజయనగరం), డా. జి వి పూర్ణచందు (విజయవాడ) తదితర సాహిత్యకారులు పాల్గొంటున్నారని, రెండు రోజులు పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. విలేకర్ల సమావేశంలో ఛత్తీస్ ఘడ్ తెలుగు మహా సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్, కార్యవర్గ సభ్యులు కొండప్ప వెంకటరావు, ప్రపంచ తెలుగు రచయితల మహాసభల గౌరవాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, ప్రధాన కార్యదర్శి డా. జి వి పూర్ణచందు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి సముద్ర స్నానాలు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెం, చిన్న కర్రివానిపాలెం, పుక్కల్లపాలెం, కొత్తపాలెం, బట్టివానిపాలెం, కపాసుకుద్ది తదితర గ్రామాల సముద్ర తీరాలలో రథసప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర తీరానికి చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా సముద్రతీరాలలో అధిక సంఖ్యలో మహిళలు చేరుకొని సూర్యోదయం సమయంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సముద్ర తీరంలో ఆవుపేడతో అలికి, వరి పిండితో పద్మం వేసి, ఆవు పేడతో చేసిన పిడకలకు నిప్పు పెట్టి దానిపై ఆవు పాలు, కొత్త బియ్యం, బెల్లం, నెయ్యి, యాలకులు వేసి చెరుకుగడ తో పాయసం వండి సూర్యభగవానునికి నైవేద్యంగా పెట్టారు. సముద్ర తీరానికి వేకువ జాము నుండి అధిక సంఖ్యలో మహిళలు తండోపతండాలుగా తరలివచ్చారు.

రూ.50లక్షలతో ప్రారంభమైన 'బసివలస-బాలసీమ' సి.సి రహదారి పనులు

విశాలాంధ్ర-నరసన్నపేట: గత వైసిపి ప్రభుత్వ హాయాంలో నిరాదరణకు గురైన రహదారులు, కూటమి ప్రభుత్వం పుణ్యమా అని, అద్దంలా ముస్తాబవుతున్నాయి. మండలంలోని బసివలస-బాలసీమ కూడలి వరకూ ఉన్న బి.టీ రహదారి గోతులమయంగా మారటంతో రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ఈ బి.టి రహదారిని తొలగించి, దీని స్థానంలో సిమ్మెంటు రహదారి నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయటంతో పంచాయితీ రాజ్ శాఖ డి.ఈ, సత్యంనాయుడు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏ.పి.ఓ, యుగంధర్ సుమారు రూ.50లక్షలతో సిమ్మెంటు రహదారి నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ సంధర్భంగా గతుకులతో దర్శనమిస్తున్న బి.టీ రహదారిని జెసిబితో తొలగించి, సిమ్మెంటు రహదారికి అనుకూలంగా భూమిని చదును చేశారు. సుమారు 1580మీటర్ల పొడవున సిమ్మెంటు రహదారి నిర్మాణం వేగవంతంగా చేసేందుకు పంచాయితీ రాజ్ శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు చర్యలు చేపట్టారు.

ఘనంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, జోస్యుల కృష్ణబాబు, జోస్యుల సుబ్రహ్మణ్యబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేకువజామున స్వామివారికి పంచజలాలతో అభిషేకం చేసి, తర్వాత క్షీరాభిషేకం చేశారు. అభిషేకం అనంతరం స్వామివారికి పలు రకాల పుష్పాలతో మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు స్వామివారి తీర్ధ, ప్రసాదాలు అందచేశారు. ఈ సంధర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారిని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ దర్శించి, ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 6న 'విజయగౌరీ' నామినేషన్‌కు తరలిరండి

అధ్యాపక మిత్ర సంఘాలు పిలుపు

విశాలాంధ్ర-నరసన్నపేట: ఈ నెల 6వ తేదీన విశాఖపట్నంలో ఉదయం 11గంటలకు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి, కోరెడ్ల విజయగౌరీ నామినేషన్‌కు జిల్లాలోని అధ్యాపక, ఉపాధ్యాయ మిత్రులు హాజరు కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి, యు.టి.ఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, గొంటి గిరిధర్ కోరారు. అంతకు ముందు విశాఖలో జగదాంబ జంక్షన్ సమీపంలో సరస్వతి పార్కు నుండి ర్యాలీ బయలుదేరుతుందని, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మిత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. శ్రీకాకుళంలోని మంగళవారం యు.టి.ఎఫ్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు

విశాలాంధ్ర-కవిటి: రథసప్తమి సందర్భంగా మండల కేంద్రమైన కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులచే సూర్య నమస్కారాలు అభ్యాసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడు యొక్క విశిష్టత ప్రిన్సిపాల్ పండి బిందుమాధవి, ఏవో రాణి విద్యార్థులకు తెలిపారు. అనంతరం యోగా యొక్క విశిష్టత సూర్య నమస్కారాలు విశిష్టత యోగాతో విద్యార్థులకు ఉన్న అనుబంధం చేయడం వల్ల విద్యార్థి దశలో వచ్చే ఉపయోగాలు గూర్చి ఉపాధ్యాయులు దశరథ తెలిపారు.విద్యార్థులు సూర్య అష్టకముతో,సూర్య నమస్కారాలు, మంత్రోచ్ఛరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-కవిటి: రథసప్తమి సందర్భంగా అరసవల్లిలో గల శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు సతీమణి, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్ఆర్సిపి యువనేత నర్తు శివాజీ తో పాటు కుటుంబ సభ్యులు అరసవల్లి లో గల సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా ప్రజానీకం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

గ్రీన్ స్కూల్స్ కు ఎంపికైన బ్రాహ్మణతర్లా పాఠశాల

విశాలాంధ్ర-పలాస: సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) నిర్వహించిన గ్రీన్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జాతీయ హరితదళ క్లబ్ (ఎన్జీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ హిత కార్యక్రమాలకు గాను గ్రీన్ స్కూల్స్ పురస్కారానికి ఎంపికయ్యింది. ఈ నెల 4 న దేశ రాజధాని న్యూఢిల్లీ గల స్టేయిన్ ఆడిటోరియంలోని ఇండియా హాబిటేట్ సెంటర్ లో జరిగిన కార్నివాల్ అవార్డుల ప్రధానోత్సవంలో సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ నుంచి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖధికారి డా. తిరుమల చైతన్య, ప్రధానోపాధ్యాయులు ఎస్వీ. రమణారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్. బాలాశంకరం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఐజీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి భద్రతా దృష్ట్యా తీర ప్రాంత ముందస్తు సమాచార సేకరణ విషయమై ఆరా తీసి తీర ప్రాంతంలో గస్తీ పెంచుతూ భద్రత పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. సముద్రతీర ప్రాంతంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పై నిఘా పెట్టాలన్నారు. సిబ్బంది వివరాలు, పనితీరుపై ఆరా తీసి ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

పోస్టుల రద్దు చుట్టూ విద్యాశాఖ సంస్కరణలు

- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి

విశాలాంధ్ర - ఆమదాలవలస: పాఠశాల విద్యాశాఖలో సంస్కరణలన్ని ఉపాధ్యాయ పోస్టులు రద్దు చుట్టూ తిరుగుతున్నాయని ఎస్ టీ యు జిల్లా అధ్యక్షులు ఎస్వి రమణ అన్నారు. మంగళ వారం ఆమదాలవలస మండల విద్యాశాఖా కార్యాలయం లో ఎస్టీయు నాయకులు స్వాతంత్ర్య సమరయోధుడు ఉర్దూ కవి ప్రముఖ కార్మిక నాయకుడు, మాజీ శాసన సభ్యులు, మాజీ శాసన మండలి సభ్యులుగా తెలంగాణ ప్రాంతానికి సుపరిచితులు అలాగే ఉపాధ్యాయ ఉద్యమానికి, ఎస్.టి.యుకు ఊతమిచ్చిన మహానుభావుడు. కీ.శే. మఖ్దూం మొహియుద్దీన్ జ యంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి. రమణ మూ ర్తి ఉపాధ్యాయ సమస్యల పట్ల నిబద్ధతతో రాజీలేని పోరాటం చేసి మొహియుద్దిన్ స్ఫూర్తిని కొనసాగిం చాలని ఎస్టీయు కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. అనంతరం జిల్లా ప్రధానకార్యదర్శి జి.రమణ మాట్లా డుతూ పాఠశాల విద్యా శాఖలో గత కొన్ని సంవత్స రాలుగా సంస్కరణల వరంపర కొనసాగుతున్నాయని అయితే ఈ సంస్కరణలన్నీ ప్రభుత్వ పాఠశాలల బలోపేతా నికి కాకుండా ఏరకంగా అయితే ఎక్కువ పోస్టులు మిగులుగా ఉంటాయి అనే ఆలోచనతోనే సంస్కరణలు చేపడుతున్నారని విమర్శించారు. దీనికి ప్రత్యక్ష ఉదారణగా ఇప్పుడు జరుగుతున్న విద్యా ర్థులు మ్యాపింగ్ ను తీసుకోవచ్చు మోడల్ ప్రైమరీ పేరుతో పాఠశాలల సంఖ్యను కుదిస్తున్నారు అని వివరించారు. ఉన్నత పాఠశాలలగా ఉన్నతీకరన పేరుతో వేల సంఖ్యలో ప్రాథమికోన్నత పాఠశాలలను మూ సివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇది ఎంత మాత్రం పాలక వర్గానికి తగదని ఈ రకంగా విద్యార్థుల మ్యాపింగ్ పూర్తి చేస్తే ఏకోపాధ్యయ పాఠశాలలు పెర గనున్నాయని విద్యార్థుల ప్రగతి కుంటుపడుతుందని ఆవేదన చెందారు. రాష్ట్ర స్థాయితో పాటు మండల, జిల్లా స్థాయిలో కూడా విద్యార్థుల మ్యాపింగ్ విష యంలో ఉపాధ్యాయ సంఘ నాయుకుల అభిప్రా యాలను తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, వంటి పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులను కొనసాగిస్తున్నప్పుడు హైస్కూల్ ప్లస్ విషయంలో ఎందుకు రద్దు దిశగా ఆలోచన చేస్తున్నారని అధికారులను తప్పు పట్టారు. బదిలీ చట్టంలో ఎస్జీటిల మేరకు అయినా మాన్యుయల్ కౌన్సలింగ్ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యు లు పి.రామకృష్ణ, బి.రమేష్, బి.శ్రీనివాసరావు, జి.నరేష్, ఎన్.శ్రీనివాసరావు, బి.మన్మధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ గోదావరి పోలమ్మ తల్లి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: రథ సప్తమి పర్వదినం శ్రీ గోదావరి పోలమ్మ తల్లి వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రం సంతబొమ్మాళి పోలమ్మ తల్లి ఆలయం సన్నిధిలో మంగళవారం మహా అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఏటా రథ సప్తమి రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 31ఏళ్ళ నుంచి కొనసాగుతుంది. పోలమ్మ తల్లి ఆలయ కమిటీ బృందం ఆధ్వర్యంలో సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ కి చెందిన ప్రజలు సంఘటితంగా తమ వంతు సహాయ సహకారాలు అందించి ఈ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. అలాగే దండుగోపాల పురం, తాళ్లవలస, చిన్న తుంగాం, సవరపేట, వడ్డివాడ, కోటబొమ్మాళి, గ్రామాల నుంచి దాదాపు 6వేల మంది పైబడి భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వకరించారు. అలాగే స్థానిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్టేషన్ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ఉపాధి సిబ్బంది అమ్మవారి ప్రసాదం ఆరగించారు.భక్తులు రద్దీ ని దృష్టిలో పెట్టుకొని వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఆరు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, యువతీ యువకులు గ్రామస్తులు అమ్మవారి కి సేవలు అందించి తరించారు . ఈ సందర్బంగా సాయంత్రం అమ్మవారి సన్నిధిలో భజన కార్యక్రమం నిర్వహించారు.

30వ రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

- పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మన శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి9వ తేదీన నిర్వహించనున్న 30 వ రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఇప్పటి వరకు వరుసగా సిక్కోలు లో 10 రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి 11 వ సారి నిర్వహించేందుకు సిద్ధం అవుతుండడం అభినందించాల్సిన విషయమని అన్నారు. ఈ విధంగా పోటీలు నిర్వహించి బాడీ బిల్డర్స్ ప్రోత్సహిస్తున్న ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేట్ అసోసియేషన్ సెక్రటరీ వి. విజయ్ కుమార్ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేదిన శ్రీకాకుళం నగరంలో పీఎస్ఎన్ఎం స్కూల్లో 30వ మిస్టర్ ఆంధ్ర ఛాంపియన్ షిప్ -2025 నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు 1,25,000 రూ క్యాష్ అవార్డు ఇవ్వనున్నామని, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాట్లు క్రీడాకారులకు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ పిఎసి ఎస్ నెంబర్ కింజరాపు హరి వరప్రసాద్, జిల్లా తెలుగుదేశం పార్లమెంటరి పార్టీ కోశాధికారి ఇప్పిలి తిరుమల రావు, నేషనల్ రిఫరీ బి. సూరిబాబు, తార డిజిటల్ శరత్ చందర్, శ్రీకాకుళం సెక్రటరీ వి. విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత దర్శనం ఆనందదాయకం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: కూటమి ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన మొదటి సంవత్సరం ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆరోగ్య ప్రదాతను దర్శించుకోవటం ఆనందదాయకంగా ఉందని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం వేకువజామున ఆయన శ్రీకాకుళంలోని అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని కుటుంబసభ్యులతో నిజరూప దర్శనం తిలకించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు రథసప్తమిని రాష్ట్ర పండుగగా చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. మన రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారి సౌకర్యార్థం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. అంతేకాక శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా చేయటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, సతీమణి బగ్గు సుగుణమ్మ, కుమార్తె, బగ్గు అర్చన, మెండ రాంబాబు, విజయశాంతి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిపట్ల "అప్రమత్తం కండి"

విశాలాంధ్ర-పొందూరు: మానవ శరీరంలోకి తోలుచుకుపోయి శరీర భాగాలను అనారోగ్యపరిచే క్యాన్సర్ మహమ్మారి పట్ల విద్యార్థులు అప్రమత్తం కావాలని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ ఉదయలక్ష్మి అన్నారు. వరల్డ్ క్యాన్సిల్ డే సందర్భంగా స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మారుతున్న దైనాంధిక జీవన విధానం అలాగే ప్లాస్టిక్ వాడకము వలన,కాలుష్యము వలన, మానసిక ఒత్తిని వలన క్యాన్సర్ అభివృద్ధి చెందిన దేశాల్లో అధికమవుతున్నాయని వివరించారు. విద్యార్థిని విద్యార్థులకు మంచి జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. క్యాన్సర్ ముందస్తు సంకేతాలను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలుని వైద్యానికి హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర సంతబొమ్మాళి: పిన్న వయసులో న్యూరోపతి వ్యాధితో బాధపడుతున్న కాపుగోదయవలస గ్రామానికి చెందిన యవంత్ అనే పదేళ్ల బాలునికి హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సాయం అందించింది. గత కొన్ని రోజులు గా విశాఖపట్నం ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాలుని దీన గాధ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు దృష్టి కి రావడం వారంతా స్పందించి 70 వేల రూపాయలు బాధిత బాలుని కుటుంబానికి చికిత్స పొందుతున్న ఆసుపత్రి కి వెళ్లి అందించారు.

కానరాని ఎంఎల్‌సి ఎన్నికల కోడ్..!

విశాలాంధ్ర-మందస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోంది. కోడ్ అమలులో ఉన్న మందస హరిపురం బాలిగాం జంక్షన్ లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా రహదారులలో రాక పోకలు సాగిస్తున్న స్థానికులు ఈ ప్రాంతానికి ఎన్నికల కోడ్ వర్తించదా..? అంటూ విస్మయానికి గురవుతున్నారు. హరిపురం బాలిగాం జంక్షన్ లో రాజకీయనాయకుల విగ్రహాలకు ముసుగులు వేయకుండా భాధ్యత గల ఉద్యోగులు అధికారులు ఎన్నికలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.అసలు కోడ్ ఊసే కానరావడం లేదనే చర్చ జరుగుతోంది. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేతల విగ్రహాలకు ముసుగులువేయడం, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు విస్మరించడం పై స్థానికులు మండి పడుతున్నారు.ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులే గాలికొదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మందస, హరిపురంలలో కోడ్ ఉల్లంఘన తీవ్ర చర్చనీయాంశమైంది.

కూటమి హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని జనసేన మండల నాయకులు చింత మోహనరావు,తామాడ లక్ష్మణ్ రావులు అన్నారు. .మంగళవారం కొమరల్తాడ రైతు సేవా కేంద్రం నుండి దేవునల్తాడ గ్రామం వరకు కొత్తగా నిర్మిస్తున్న తారు రోడ్ పనులను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష కు ధన్యవాదాల్ను తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డు మధు, గణపతిరావు, టెంక తేజేశ్వరరావు తామాడ కోదండరావు, లిమ్మాడ నాగరాజు, దండుపాటి విగ్నేష్,పవన్ కుమార్,బొడ్డు రవణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో మెరిసిన అట్టాడ సిస్టర్స్

విశాలాంధ్ర-పలాస: తమిళనాడు మధురై లో జరిగిన జాతీయస్థాయి స్కేటింగ్ 1000 మీటర్ల పోటీలలో మరియు రిలే 800 మీటర్ల పోటీలలో 8 ఏళ్ల అట్టాడ హాన్విక రజత పతకం,అలాగే రిలే 800 మీటర్ల స్కేటింగ్ పోటీలో 5 ఏళ్ళ అట్టాడ మాన్విత‌లు జాతీయ స్కేటింగ్ పోటీలో రజిత పతకం సాధించి ఛాంపియన్ షిప్, స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ అవార్డు ను గెలుచుకున్నారు. గత ఏడాది డిసెంబరులో బెంగళూరులో జరిగిన రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ 24వ జాతీయ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌ను మధురైలో నిర్వహించింది. అక్క చెల్లెలు అయిన హన్విక,మాన్విత కర్ణాటకకు ప్రాతినిధ్యం వహించారు. 2025-26 ఏడాది కోసం టీమ్ ఇండియా (అంతర్జాతీయ స్థాయి)కి ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించుకున్న బికాం విద్యార్థిని

విశాలాంధ్ర- టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల బికమ్ మొదటి

సంవత్సరం చదువుతున్న పడాల అక్ష అనే విద్యార్థిని, కాకినాడలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో తలపడి రెండవ స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్ సాధించుకున్నట్లు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం విద్యార్థినికి పుష్పగుచ్ఛంతో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో టెక్కలి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన ఆమెకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సతీష్ కుమార్, ఐక్యుఏసి కోఆర్డినేటర్ వి.ల్యూక్ పాల్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఓ కోటీశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.సత్యనారాయణ, కామర్స్ విభాగ అధ్యాపకులు హేమరాజు, మల్లేశ్వరరావు, లోకేశ్వర రావు, తేజోవతి పలువురు అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రంలో ఇది చారిత్రాత్మకమైన బడ్జెట్

విశాలాంధ్ర-టెక్కలి: ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో వికసిత్ భారత్ ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని, మధ్య తరగతి ఆదాయ వర్గాలకు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తీపి కబురును ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ 2025-26 బడ్జెట్ లో ప్రతి పాదించారని బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు గునా మీనా కుమార్ అన్నారు. టెక్కలిలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపునివ్వడం ఓ విప్లవాత్మక నిర్ణయమన్నారు. యువతలో నైపుణ్య అభివృద్ధి, ఉద్యోగ శిక్షణ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్య మిచ్చారన్నారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా హామీ లేకుండా ప్రస్తుతమిచ్చే రుణాన్ని రూ.5 కోట్ల నుండి రూ.10 కోట్లు కేంద్రం పెంచారని, విస్తరణ కారణంగా సుమారు కొన్ని వేల మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచడం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

అరసవిల్లి రథసప్తమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ధర్మాన

విశాలాంధ్ర-నరసన్నపేట: శ్రీకాకుళంలోని అరసవిల్లిలో మంగళవారం రథ సప్తమి వేడుకల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకొని, స్వామివారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, తీర్ధ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపిపిలు, ఆరంగి మురళీధర్ దంపతులు, వాన గోపి దంపతులు,జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, వైసిపి నాయకులు, కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు. రాజాపు అప్పన్న, హైమావతి దంపతులు, ముద్దాడ బైరాగినాయుడు, దమయంతి దంపతులు, మొజ్జాడ శ్యామలరావు, బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

రథసప్తమి వేడుకలు సరికొత్త అనుభూతి

- జిల్లా అధికార యంత్రాంగం సమిష్టి కృషి అభినంద నీయంలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రాష్ట్ర పండుగ రథసప్తమి వేడకల్లో భాగంగా శ్రీ అరసవల్లి సూర్యనాయారణ స్వామి సందర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికార యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ నుంచి ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని రథసప్తమి వేడుకలు నభూతో నభవిష్యత్ అన్న రీతిలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ ఇబ్బందులు కలగకుంగా సజావుగా ఉత్సవాలు నిర్వహించిన రాష్ట్ర పండుగగా అరసవల్లి కీర్తిని ప్రతిష్టతను పెంచగలిగారన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల కొరకు గత నెలరోజుల పాటుగా శ్రమించిన అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

తోటపాలెంలో గ్రామ దేవత ఉత్సావాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : తోటపాలెం గ్రామంలో ప్రతీ ఐదేళ్లకోసారి నిర్వహించే గ్రామ దేవత ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభవ య్యాయి. ఈ మేరకు మంగళవారం గ్రామ పెద్దలు సమావేశమై ఈ నెల 19న పండగ సన్నాహాల్లో భాగంగా సనప వేయన ఉన్నారు. అలాగే మార్చి 11న అనుపోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గూరు జగవతిబాబు, మాజీ సర్పంచ్లు కళ్లేపల్లి తిరుపతిరావు. కడుపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ క్యాంపస్ సూర్య నమస్కారాలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్లో రథ సప్తమి పురస్కరించుకుని మంగళవారం సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వకృత్త్వ, యోగాసనాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కార్ల మోహన్ కృష్ణ చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి. యోగా విభాగాధిపతి డాక్టర్ జి.ఈశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ముక బందరావు తదితరులు పాల్గొన్నారు.